తోడు దొంగలు

ఏ. వీ. మోహన్రావ్

మద్రాసు త్యాగరాయ నగర్‌లోని, కోదండపాణి వీధి చివర వున్న పాడుపడ్డ పాత బంగళాకు ఉన్నట్లుండి దశ తిరిగింది. పది దినాలనుంచి రకరకాల పనివాళ్ళు వచ్చి రాత్రింబవళ్ళు రిపేర్లుచేసి, రంగులు పూసి, క్రొత్త మహల్‌లా తీర్చిదిద్దటం ఆ వీధిలోని చాలా మందికి ఆశ్చర్యం కలిగించింది.

ఆ యిల్లు ఎవరో రాజకుమారుడు కొన్నట్లు, ఆయన మకాం రాబోతున్నట్లు అందుకోసమే, ఆయన సెక్రెటరీగా చెప్పుకొనే వొంటికంటి మనిషి, రెట్టింపు కూలీలిచ్చి పని చేస్తున్నట్లు చెప్పుకోసాగారు అంతా.

ఒక రోజు తెల్లవారేసరికి బంగళా మొత్తం హడావుడిలో మునిగిపోయింది. సెక్రెటరీ గుమ్మం వెలుపల నిల్చుని, హాండ్ స్టిక్ ఊపుకుంటూ, ఆత్రుతగా రోడ్ వంక చూడటం, ఎదురింట్లో బ్రహ్మచారి ఏకాంబరం పైనుంచి గమనించసాగాడు.

మెల్లగా క్రిందికి దిగొచ్చి సెక్రెటరీగార్కి దూరంగా నిలబడి "నమస్తే" అన్నాడు.

ప్రతిమస్కారం చేశాడు సెక్రెటరీ.

"నా పేరు ఏకాంబరం. ఆ యింట్లో మేడమీద అద్దెకుంటున్నాను, ఈ బంగళాను మీరు కొన్నారా?" అడిగాడు.

అతన్ని ఆపాదమస్తకం పరిశీలనగా చూశాడు సెక్రెటరీ. కాలుతున్న పైపును నోట్లోనుంచి తీసి, చేత్తో పట్టుకొని "నో! ఇలాంటి చెత్త కొంపలు కొనరు మారాజావారు. నెల రోజుల మకాం వుండాలని వచ్చాం! అద్దెకు తీసుకున్నాం!" అన్నాడు సెక్రెటరీ.

"ఆ మాత్రానికేనా బంగళా మొత్తం తిప్పి కట్టారు. కనీసం పాతిక వేలన్నా అయివుండాలి." అన్నాడు ఏకాంబరం విస్తుపోతూ.

"అది ఆఫ్టరాల్ చిన్న ఖర్చు మా రాజావారికి." అన్నాడు సెక్రెటరీ.

అంతలో దూరంనుంచి పెద్ద ఇంపాలా కారు దాని వెనుక మరో అంబాసిడర్ రావడం కనిపించింది.

"రాజావారు వస్తున్నారు. మీరు వెళ్ళండి!" అంటూ హడావుడిగా రోడ్డుకు అడ్డం పరుగెత్తాడు.

రాజావారి కారు గేటు గాటి బంగళా కాంపౌండ్‌లోకి ప్రవేశించి పోర్టికో చేరింది. సెక్రెటరీ పరుగెత్తు

కుంటూ వెళ్ళాడు.

పది మంది పనివాళ్ళు వరుసగా నిలుచున్నారు, తలలు వంచుకొని తెల్లటి యూనిఫాంలో.

రాజావారు దిగి అందరి అభినందల్నూ, నమస్కారాలనూ, స్వీకరిస్తూ, సెక్రెటరీ ఒకవైపు, రాణిగారు మరో వైపు నడుస్తుండగా మేడపైకె వెళ్ళారు.

ముగ్గురూ గదిలోకి వెళ్ళగానే, సెక్రెటరీ వెళ్ళి తలుపులు మూసి వచ్చాడు.

"ఏమిటి విశేషాలు?" అడిగాడు రాజాగారు పట్టుబాలీసుల నానుకొని కూర్చుంటూ.

"ఏమి లేవు అంతా నార్మల్ గావుంది" అన్నాడు సెక్రెటరీ.

"కలకత్తా వ్యవహారం గురించి ఈ వూళ్ళో ఏమైనా చర్చలు జరుగుతున్నాయా?"

"ఇప్పుడు లేదు. అంతా చల్లబడిపోయింది."

"గుడ్! మనం ఆరు మాసాలు అజ్ఞాతవాసం చేసి ఆ తర్వాత తల బైట పెట్టడం మంచిదయిందంటావా?" అడిగాడు రాజాగారు.

"అవును ఈ రాణిగార్ని ఎక్కడ పట్టారు" అడిగాడు సెక్రటరీ.

"కాకినాడ బ్యాంక్ స్ట్రీట్ లో."

"ఆ బాపతని చూడంగానే అనుకొన్నాను. నడక, నవ్వు, మాట బాగా మార్చుకోవాలి నువ్వు. లేకుంటే నీ గుట్టు బైట పడుతుంది. దాంతోపాటు మేమూ తిన్నగా శ్రీ కృష్ణజన్మస్థానం పోవల్సి వుంటుంది." అన్నాడు సెక్రెటరీ.

"చెప్పండి. ఇనుకొంటూ" అంది రాణిగారు.

"మూర్తీ! ఈమెను గదికి పంపెయ్" అన్నాడు రాజాగారు.

ఆ సెక్రెటరీ పేరు మూర్తని ఆమెకు అప్పుడు అర్థమయింది.

మూర్తి ఆగదికి వెనుకనున్న గది చూపించి వెళ్ళమని కళ్ళతో చెప్పాడు. రాణిగారు వెళ్ళిపోయింది.

"ఇంక చెప్పు!" అన్నాడు రాజాగారు.

"మనం అనుకున్న పథకానికి అన్ని ఏర్పాట్లు చేశాను. ముహూర్తం కూడా సిద్ధం చేశాను. నెల తిరిగేలోపల పని మొత్తం పూర్తి చేసుకొని మనం మకాం ఎత్తెయ్యాలి ఈలోగా ఇక్కడ్నుంచి ఎక్కడికి వెళ్ళాలన్నది కూడా మనం ఆలోచించుకోవాలి," మూర్తి అన్నాడు.

"గుడ్! ఈ పని పూర్తయ్యాక మన తర్వాతి కార్యక్రమం దొంగ నోట్లు అచ్చు వెయ్యడం దానికి అనువైన ప్రదేశం చూచి వుంచాను. ముందక్కడికి చేరుకుంటే ఆ తర్వాత మిగిలిన పనులు చూద్దాం." అన్నాడు రాజాగారిలా నటిస్తున్న ఆనంద్.

ఆనంద్ పేరుపడ్డ గజదొంగ. చిన్నతనంనుంచి ఎన్నో దొంగతనాలు చేశాడు. ప్రతిసారి పోలీసులకు చిక్కినట్లే చిక్కి, పాదరసంలా వాళ్ళ చేతిలోంచి తప్పిపోయాడు. అతన్ని ఆ డిపార్టుమెంటులో అందరూ 'మిస్టర్ మెర్క్యూరీ' అని రిఫెర్ చేస్తుంటారు.

మూర్తి అతని నమ్మిన బంటు. ఆనంద్‌తో చేరక ముందు కలకత్తాలోని రిలియన్స్ బ్లాక్ మేకింగ్ కంపెనీలో పనిచేసేవాడు. అతన్ని మించిన పనివాళ్లు లేరని అందరూ అంటారు. ఒక డిజైన్ చూసి, అందులో ఎన్ని రంగు

లున్నదీ, ఎలాంటి స్క్రీన్ వాడవలసిందీ, ఎలా ఎచ్చింగ్ చెయ్యవలసిందీ, గడగడ చెప్పగల సమర్థుడు. కౌంటర్ ఫీటింగ్ చేసి కోటీశ్వరుడు కావాలన్న కలలు కనేవాడు. అతనికి ఆనంద్ తోడయినాడు.

ఇద్దరూ కలసి కలకత్తాలో ఫస్టుసిటీ బ్యాంక్ వాళ్ళ వానును పట్టపగలే దోచుకొన్నారు. వీళ్ళ దురదృష్టంవల్ల నాలుగు లక్షలకు మించి దొరకలేదు అందులో. కానీ వాక డ్రైవర్ని, తమను చూశారన్న అనుమానంతో మరో కిల్లీ కొట్టు ఓనర్ను చంపివేశారు.

ఆ తర్వాత అండర్ గ్రౌండ్ లో వుండిపోయారు. మరో క్రొత్త పథకం వేసుకుని మద్రాసుకు ప్రస్తుత పు రూపాల్లో చేరుకున్నారు.

"రాణీగారి సంగతేమిటి?"

"ఈ నెలా అనుభవించనీ భోగం. ఆ తర్వాత ఆమెను స్వర్గానికి పంపించి మనం నరకానికి పోదాం!" అన్నాడు ఆనంద్.

"నా రాక గురించి అవసరమైన ప్రచారం చేశావా?" అడిగాడు ఆనంద్.

"పోలీసులకు చెప్పలేదు. కాస్మాపాలిటన్ క్లబ్బులో మీ పేరున మెంబర్ షిప్ తీసుకున్నాను, అలాగే లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ లోకూడా. మూడుచోట్ల పెద్ద పార్టీలు ఏర్పాటు చేశాను. అవి పూర్తయ్యేసరికి ఈ మద్రాసు మహానగరంలో మిమ్మల్ని తెలీని కోటీశ్వరులు వుండరని నా అభిప్రాయం. ఆ తర్వాత మన పని ప్రారంభం చేద్దాం!" అన్నాడు మూర్తి.

"నీది బ్రెయిన్ కాదు?" ఆనందంతో ఉప్పొంగిపోతూ అన్నాడు రాజాగారు వురఫ్ ఆనంద్.

“దాన్ని పొగడడం మాటలా వుంచు. మనదగ్గర ఎక్కువ డబ్బు లేదు. రెండులక్షలదాకా ఖర్చయిపోయింది. జాగ్రత్తగా వాడుకోవాలి.” అన్నాడు మూర్తి.

“ఓ. కే.” అన్నాడు రాజావారు.

“మన గురించి ఎవరైనా ఆత్రుత పడుతున్నారా?” అనుమానంగా చూస్తున్నారా?”

“లేదు! కానీ ఎదురింట్లో ఏకాంబర మనే ఒకతను వున్నాడు. అతను కిటికీలో కూర్చుని అస్తమానం ఈ బంగళాకేసి చూస్తున్నట్లు నా కనుమానంగా వుంది. ఆత్రుత ఆపుకోలేక ఇవాళ నా దగ్గరకొచ్చి మాట్లాడాడు కూడా!”

“ఖర్చు రాసేద్దాం?”

“అంత అవసరం లేదు! అతని సంగతి నేను చూచుకుంటాను, నువ్వుమాత్రం అసలైన నిసలయిన రాజాలా దర్పం వెలగబోస్తూ, దర్జా వెలిగిస్తూ వుండాలి!” అన్నాడు మూర్తి.

2

వారంలోపల ప్లాన్ ప్రకారం మూడు క్లబ్బుల్లోనూ నేరేడుపల్లి రాజా శ్రీ వీరవెంకట సత్యనారాయణమూర్తి గారు ఇచ్చిన ఘనమైన పార్టీలు ముగిశాయి.

కోట్లకు పడగలెత్తిన ప్రముఖులంతా శ్రీమతులతో సహా వచ్చి విస్కీతోపాటు విందు గూడా ఆరగించి వాళ్లు అలసిందాకా బాల్ డాన్సులు చేసి వెళ్ళిపోయారు.

ఇరవై వేల ఖర్చుతో పదిదినాల్లో రాజావారు మద్రాసు మహానగరంలోని పెద్ద వాళ్ళ సంఘంలోకి జొరబడిపోయాడు.

ఆయన్ని పెట్టుబడి పెట్టమంటూ కొందరూ, విరాళాలివ్వమంటూ మరికొందరూ, సభలకు రమ్మనో, లేక ప్రారంభోత్సవం చెయ్యమనో మరికొందరూ, రావటం మొదలెట్టారు.

"ఈ మనుష్యులు నిజంగా మట్టిముద్దలు మూర్తీ. మెరిసేదంతా బంగారమనుకుంటారు. మన నిజస్వరూపం తెలిసిందంటే మైళ్ళదూరం పారిపోతారు!" అన్నాడు ఆనంద్.

"వాళ్ళను కాదు మనం అనుకోవలసింది. వాళ్ళ డబ్బుకూ, అది ఉన్నవాళ్ళకు, ఇచ్చే గౌరవాన్ని. ఈ సంఘంలో అదే బలహీనత. దాన్ని ఆధారం చేసుకొనే మనలాంటి వాళ్ళు దెబ్బ తియ్యాలి" అన్నాడు మూర్తి.

"అది రైటే! మనం ఈ ప్రాజెక్టుపైన దాదాపు రెండు లక్షలు ఖర్చుపెట్టాం. కనీసం పెట్టుబడన్నా దక్కుతుందంటావా?" అడిగాడు ఆనంద్.

"ఎంత చచ్చుగా వచ్చిన కనీసం పదిలక్షలన్నా రావాలి! ఆపైన చిక్కితే మనం అదృష్టవంతులమే!" అన్నాడు మూర్తి.

"ఏమో?" అన్నాడు ఆనంద్.

"అలా నిరాశపడకూడదు. అన్ని వ్యాపారాలలాగే మనదీ ఒక వ్యాపారం. లాభనష్టాలు ముందే తెలుస్తాయా? వ్యాపారం జరిగాక గాని లెఖలు తేలవు" అన్నాడు మూర్తి.

"నా బాధ అదికాదు. ఏ పరిస్థితుల్లోనూ మనం చిక్కిపోకూడదు. జాగ్రత్తగా అన్ని ఏర్పాట్లు చెయ్యి. ఓ మారు మనం కూర్చుని తర్కించుకోవడం అవసరం.

ఏమైనా లోటుపాట్లు ఉన్నట్లు తోస్తే సర్దుకోవచ్చు" అన్నాడు ఆనంద్.

"అలాగే!" అంటూ లేచాడు మూర్తి.

ఆనంద్ ఆతర్వాత ఆలోచిస్తూ కూర్చున్నాడు. రాణీ గారు లోనికొచ్చారు.

"ఏమండీ!" పిలిచింది రాణి.

"రా! కాంతం!" అన్నాడు ఆనంద్.

రాణి వచ్చి దగ్గరగా నిలుచుంది.

"ఏం కావాలి!" అడిగాడు ఆనంద్.

"నాకు, ఖరీదైన చీరలు, తిండి, పడక, కావాలను కొని మీతో వచ్చేశాననుకుంటున్నారా?" అడిగింది కాంతం.

అర్థం గానట్లు చూశాడు ఆమెవేపు.

"నేనెలాంటి బ్రతుకు బ్రతికానో మీకు తెలుసు.నన్ను తెచ్చి ఇలా బంగారుపంజరంలో తోశారు. నా అతీగతీ కనుక్కోవడంలేదు. నా కిక్కడ వుండాలనిపించడంలేదు. పంపించెయ్యండి. కాకినాడ వెళ్ళిపోతాను"అంది కాంతం.

ఆ మాటలకు అదిరిపడ్డాడు ఆనంద్.

"మూర్తి, అదే నా సెక్రెటరీ నీ మంచిచెడ్డలు చూడటం లేదా?"

"అతను చూసేవి వేరు. మీరు చూడవలసినవి వేరు" అంది కాంతం.

ఆమె అభిప్రాయం అర్థమైంది. తన గొడవల్లో, ఆలోచనల్లో, భయాల్లో, ఆమె దైహికావసరం సంగతి మరచే పోయాడు. ఆనంద్ కు స్త్రీ వ్యామోహం చాలా తక్కువ. ఆమెను తన అవసరాలకు అడ్డం పెట్టుకొనేందుకు లేపు

కొచ్చాడు తప్ప, కాపురం చేసేందుకు కాదు.

"ఓం! సారీ! బిజీగా వుండిపోయాను. పద!" అంటూ లేచాడు రాజాగారు.

కాంతం నవ్వింది.

ఆమె భుజంపైన చెయ్యివేసి నడిపించుకుపోయాడు ఆమె గదిలోకి. గాలి బాగా రావేదు. కిటికీ తలుపులు తీశాడు.

ఎదురుగావున్న ఇంటి మేడ పైభాగానికున్న కిటికీకి అతుక్కుపోయి వున్న మానవాకారం మసక చీకట్లో చూచాయగా కనుపించింది. రెక్కలు దగ్గరకు నెట్టాడు.

"ఆ మనిషి అలా చూస్తూనే వుంటాడు ఎవరో గాని" అంది కాంతం మంచంపైన కూర్చుంటూ.

"నిన్నా?"

"కాదు! మన బంగళాను."

"ఎందుకో?"

"నాకు మాత్రం ఏం తెలుసు? మీలా ఇంట్లోనే వుండే దాన్ని" కాంతం.

"ఒక వేళ నీకు తెలిసిన మనిషేమో. గుర్తుపట్టి అలా ఆశగా చూస్తున్నాడా?"

"అలా అయివుండదు. ఎక్కడ కాకినాడ? ఎక్కడ మద్రాసు?" అంది కాంతం.

గదిలో కొచ్చేప్పుడు వున్న వుత్సాహం ఆనందలో చచ్చిపోయింది. అతని ఆలోచనంతా కిటికీకి అతుక్కుపోయి వుంటున్న ఆకారం చుట్టూ పరిభ్రమించసాగింది. మాట్లాడకుండా లేచివెళ్లాడు వెలుపలికి.

తన రూంలో బెడ్ ప్రక్కనున్న కాలింగ్ బెల్ నొక్కాడు. ఐదునిముషాల తర్వాత మూర్తి పైకొచ్చాడు.

అతనికి ఎదురింటి కిటికీ మనిషి గురించి చెప్పాడు.

"ఏం చేద్దాం?" అడిగాడు మూర్తి.

"నువ్వే ఆలోచించు, కొంపదీసి అతనే రహస్య గూఢచారో అయితే మనం చిక్కుల్లో పడతాం. అతను నోరు విప్పకముందే గొంతు కురిబిగించడం మనకు శ్రేయస్కరమనిపిస్తుంది" అన్నాడు ఆనంద్.

"అలాగే అనుకున్నా - దానివల్ల చాలా ఇబ్బందులున్నాయి. ఇతను చచ్చాక, డిపార్టుమెంటు మొత్తం నిద్రలేస్తుంది. మనపైకి దాడి చేస్తుంది. మన ప్లాన్ అసలు పారదు. అందువల్ల ఆ మనిషి కంత ప్రాధాన్యం ఇవ్వకుండా మన వ్యవహారం ముగించుకొని గుట్టుచప్పుడు కాకుండా వెళ్ళిపోవడం ఉత్తమం" అన్నాడు మూర్తి.

"ఆల్ రైట్! నీ యిష్టప్రకారమే కానివ్వు!" అన్నాడు ఆనంద్.

మూర్తి లేచి తన రూంకి వెళ్ళిపోయాడు.

3

"మన ప్లాన్ మరోమారు వివరంగా చెప్పు!" అన్నాడు ఆనంద్.

మూర్తి సిగరెటు దమ్ము లాగి ఆష్ట్రేలో విదిలించాడు కాళ్లు కొంచెం ముందుకు జాపి విశాలంగా, విశ్రాంతిగా కూర్చున్నాడు కుర్చీలో.

"రేపు రాత్రి సరిగ్గా ఎనిమిదిగంటలకు ప్రారంభమవుతుంది రాజాగారి పుట్టినదినం వేడుక. ఈ పార్టీకి మొత్తం అరవైమందిని పిలుస్తున్నాం. అందరూ కోటీశ్వరులు, కొంతమంది భార్యలతో వస్తారు. మొత్తం వందమందికి పైగా అవుతారు.

మీరు మీ కులదైవానికి పూజచేస్తుంటారు సతీసమేతంగా. ఆ గదిలోకి అందరూ ప్రత్యేకమైన దుస్తులు ధరించివెళ్ళాలన్న నియమం పెడతాం. చీరలు, జాకెట్లు, పట్టుపంచెలు, పైకండువాలు మనం సప్లయి చేస్తాం. ఎవ్వరూ యేవిధమైన నగలు ధరించకూడదన్న నిబంధన పెడతాం.

దాంతో వచ్చిన వాళ్ళు వాళ్ళ బట్టలు నగలు, విప్పి పెడతారు. వాటిన్ని కాపలా కాసే బాధ్యత నేను తీసుకుంటాను. ఆహుతులందరూ లోనికెళ్ళగానే నగలన్ని పోగుచేసుకుని మన అంబాసిడర్ కారులోనికి చేర్చుకొని వెళ్ళిపోతాను. వాళ్ళందరూ గడబిడలో వుండగా నువ్వు తప్పించుకొని కాంతంతో వచ్చేయ్యాలి. ఆమెను మన వీలు చూసుకొని ఎక్కడో సఫా చేసేద్దాం'' అన్నాడు మూర్తి.

''వీళ్ళు పోలీసులకు ఫోన్ చేద్దామని గడబిడ చేస్తే!'' అడిగాడు ఆనంద్.

''చేసుకోని నువ్వేదో నెపం చెప్పి వెనక దారిన పారిపోవాలి'' అన్నాడు మూర్తి.

''ఓ.కే!'' అన్నాడు ఆనంద్.

''మనం ఎక్కడ కలుసుకోవాలి!''

''అదీ నువ్వే చెప్పు!''

''అహ్మదాబాద్‌లో మన స్థలం తెలుసుగా?''

''తెలుసు.''

''అక్కడే వుంటాను. ఒంటి కంటి రామ్మూర్తిగా కాదు. రెండు కండ్ల రజనీ పటేల్‌లా'' అన్నాడు మూర్తి.

''అలాగే'' అన్నాడు ఆనంద్.

మూర్తి దిగి క్రిందికి వచ్చాడు. పోర్టికోలోంచి వెలుపలి గార్డెన్‌లో పచార్లు చెయ్యసాగాడు. ఎదురింటి కిటికీలో చీకట్లో దయ్యంలా కూర్చునివున్న ఏకాంబరం రూపం కనుపించింది మసకగా. చూడగానే అదిరిపోయాడు.

ఏ విధమైన అవసరమూ లేకుండా, తమపైన అనుమానం కలగకుండా వుండివుంటే, ఆ మనిషి అలా గత నెలరోజులుగా ఎందుకు పహారా వేస్తుండి వుంటాడన్న అనుమానం పెనుభూతంలా మూర్తి మెదడును తొలచి వెయ్యటం ప్రారంభించింది.

ఒక్క రోజు! మరో ఇరవైనాలుగు గంటలలో తాము దాదాపు నాలుగు లక్షల రూపాయలు పెట్టుబడిపెట్టి ఆడుతున్న నాటకంలోని ఆఖరి సీను ముగిస్తుంది. అంత దాకా అతని వల్ల ఏ విధమైన అడ్డంకీ ఏర్పడకుండా చూసుకోవాలని తీర్మానించుకున్నా మూర్తి.

కానీ అది ఏలా సాధించాలన్నది అర్థంగాలేదు. ఆలోచిస్తూ పచార్లు చెయ్యసాగాడు.

4

తెల్లవారింది.

రాజాగారి బంగళా మొత్తం కోలాహలంగా వుంది. వంటలు చేస్తున్నారు. పూజగది అలంకారం చెయ్యడం కొందరు చూస్తుంటే, విస్కీ సీసాలు, గ్లాసులు, మొదలైనవి మరి కొందరు సర్దసాగారు.

క్రింది అంతస్తులో వున్న పెద్ద హాలులో, రాబోయే అతిథులు బట్టలు మార్చుకోనేందుకు ప్రత్యేకించాడు మూర్తి. అక్కడ చిన్న చిన్న బాండ్ కేసులు దాదాపు యాభై వున్నాయి. అన్నింటిపైన ఆహుతుల పేర్లు వ్రాసి

వున్నాయి. వాళ్ళు తెచ్చుకొన్న నగలు మొదలైనవి అందులో వుంచుకొని, తాళం వేసుకుని వెళ్ళేందుకు వీలుగా అలాంటి ఏర్పాటు చేసిపెట్టారు.

ఆనంద్, మూర్తి, క్రిందా పైనా తిరిగి అన్ని పనులు ఎలా జరుగుతున్నవీ పర్యవేక్షణ చేశారు.

ఇంత హడావుడిలోనూ, మూర్తి ఎదురింటి ఏకాంబరం గొడవ మరచిపోలేదు.

పది గంటల ప్రాంతంలో పైపు కాలుస్తు వెళ్ళి గేటు దగ్గర నిలబడ్డాడు ఏకాంబరం రాకకోసం చూస్తు. పది నిముషాల తర్వాత అతను రావటం కనుపించింది. మూర్తే పలకరించాడు, "ఆఫీసుకా?" అంటూ.

"అవునండీ!" అన్నాడు ఏకాంబరం.

"ఏ ఆఫీసులో పనిచేస్తారు?"

"ఐ. జి. ఆఫ్ పోలీసులో" అతను జవాబు చెప్పాడు. విని అవాక్కయిపోయాడు.

"ఇవాళ రాత్రికి మా రాజాగారి పుట్టిన దినం వేడుకలు జరుపుతున్నాం మీకు రావడానికి వీలుంటుందా?" అడిగాడు మూర్తి.

"అయ్యో! మీ అంత పెద్దలు పిలుస్తుంటే వీలు ప్రశ్న ఏమిటి? ఖచ్చితంగా వస్తాను" అన్నాడు ఏకాంబరం.

"థాంక్స్!"

"నేను చెప్పాలి! ఇంతకూ ఎన్ని గంటలకు రమ్మంటారు?"

"మందు పుచ్చుకునే అలవాటుందా?

"ఆహాఁ! భేషుగా త్రాగుతాను. తేరగావస్తే..." అంటున్నాడు ఏకాంబరం.

"అయితే ఎనిమిది గంటలకల్లా రండి" అన్నాడు మూర్తి.

"వస్తాను! ఖచ్చితంగా వస్తాను. ఇప్పుడే ఆఫీసుకు వెళ్ళొస్తాను!" అంటూ సెలవు పుచ్చుకున్నాడు మూర్తి దగ్గర ఏకాంబరం. అతను రోడ్ మలుపు తిరిగేదాకా చూసి, ఆ తర్వాత బంగాళాలోకి ప్రవేశించాడు.

ఆనంద్ ఎదురొచ్చి "ఎక్కడికెళ్ళావ్" అడిగాడు.

చేసిన ఘనకార్యం చెప్పాడు.

అంతా విని "వాకు రావడం లేనిపోని అడ్డంకు కాదూ!" అన్నాడు.

"అది కాదు నాప్లాన్! ఎనిమిదింటికల్లా వాడొస్తాడు. రాగానే వాణ్ణి వెనుక వేపు గదుల్లో ఒక దాంట్లో తోసి తాళం పెడతాను."

"అల్లరి చేస్తే!"

"ఆ అవకాశం మనం ఇస్తేగా! కాళ్ళూ చేతులు కట్టి నోటికి టేపు కరిపిస్తే బ్రతికున్న శవంలా వుంటాడు" అన్నాడు మూర్తి.

ఆనంద్‌కు మూర్తి విలువ, అతని తెలివి తేటల యొక్క ఉపయోగం అప్పుడర్థమైంది.

"సాహసం తప్ప ఓర్పు లేదు నాకు. నీకు ఓర్పుతో పాటు అపారమైన తెలివి కూడా వుంది" మెచ్చుకోలుగా అన్నాడు ఆనంద్.

"అందుకే మన ఇద్దరం ఒకటైనాం! మనకు అపజయం అసలు లేదు!" అన్నాడు మూర్తి.

ఆ పగలంతా అన్ని ఏర్పాట్లూ చేసుకోవడంలోనే సరిపోయింది ఇద్దరికి. దొడ్డి వేపు తమ దగ్గరున్న రెండు కార్ల టాంకులనిండా పెట్రోలు పోసి పెట్టుకొన్నారు. వాటికి

నెంబరు ప్లేట్లు మార్చివేశారు.

ఏకాంబరాన్ని ఏ గదిలో బంధించ వలసిందీ తర్కించుకొని నిర్ణయం చేసుకున్నారు. పనివాళ్ళను ఇద్దరిని తప్ప మిగతావాళ్ళను పంపించి వేశారు.

శాంతం తలార నీళ్ళు పోసుకొని, లూజుగా ముడి వేసుకుంది వెంట్రుకలు. ఖరీదైన తెల్ల పట్టుచీర, జాకెట్ ధరించింది. ఆనంద్ కూడా పట్టు బట్టలు కట్టుకున్నాడు. విశాలమైన ఆ హాలులో తూర్పు దిక్కుకు అభిముఖంగా ఒక దేవత తాలూకూ ఆయిల్ పెయింట్ ఉంది. దాని ముందు రకరకాల పండ్లు పూలు పెట్టి వున్నాయి. ఆహుతులు కూర్చునేందుకు పులి చర్మాలు చాపల్లా పరచి వుంచారా గదినిండా.

5

రాత్రి ఏడు కావస్తూంది.

ఆహుతు లొక్కొక్కరే రావడం మొదలెట్టారు. వచ్చినవాళ్ళందరికీ మూర్తి, రాజాగారి వంశంలోని, కట్టు బాట్లు వివరించి చెప్పాడు. వాళ్ళు బట్టలు విప్పి, నగలు తీసి తమకిచ్చిన బాండ్ కేస్‌లో పడేసుకుని తాళం వేసి, తాళాలు తీసునొని పూజ జరుగుతున్న గదివేపు పోసాగారు.

ఎనిమిదయ్యేసరికల్లా దాదాపు అందరూ వచ్చేశారు. రాజావారింటికి రావడం కాబట్టి, ప్రతి ఒక్కరూ తమ కున్న సంపదంతా ప్రదర్శించేందుకుగాను అన్నట్లు ఉన్న నగలన్నీ పెట్టుకొని వచ్చారు. ఇరవైదాకా వజ్రాల నెక్లెసులుకూడా కనుపించాయి మూర్తికి.

అందరూ పూజ జరుగుతున్న హాల్లోకి వెళ్ళారు.

ఏకాంబరం కోసం ఎదురుచూస్తూనే వున్నాడు ఏడింటి నుంచి. అతని జాడ లేదు. వస్తానన్న మనిషి రాకపోవడం

అనుమానాల్ని రేపుతూంది అతనిలో. అతన్ని గురించి ఎదురుచూడటం మానేశాడు మూర్తి. తన ప్లాన్ అమలు జరిపే పని పెట్టుకొన్నాడు.

ఆ గది తలుపులన్నీ మూసి, బాండ్ కేస్‌లన్నీ ఒక దానిపై ఒకటి పేర్చాడు. ఆ గది ప్రక్కగదిలో వున్న ఎలక్ట్రిక్ కనెక్షను కమర్చిన ఫ్యూజ్ పీకేశాడు. బంగళా మొత్తం చీకట్లో నిండిపోయింది.

మూర్తి ముందుగా సిద్ధం చేసుకున్న ప్రకారం తన అనుచరుల సాయంతో బాండ్ కేసులన్నీ కారులోకి చేర్పించుకొని, వాళ్ళిద్దరికీ చెరో వెయ్యి రూపాయలిచ్చి తుర్రుమని పారిపోయాడు కార్లో.

చీకట్లోనే కాంతాన్ని వెంటబెట్టుకుని ఆనంద్ గూడా, ఫోన్ చెయ్యమనీ, మనుషుల్ని పిలవమనీ, అరుస్తూ, జనాన్ని తప్పుకుంటూ క్రిందికొచ్చాడు. సిద్ధంగావున్న కారెక్కి స్టార్టు చేశాడు.

ఆ కారుకూడా రయ్యిమని వడిసెల్లో రాయిలా దూసుకు పోయింది.

మళ్ళీ లైట్లు వెలిగాయి.

ఆహుతులందరూ ఆత్రతగా రాజాగారికోసం చూశారు. మెట్లెక్కి పైకొచ్చిన ఏకాంబరం అందరికీ జరిగింది చెప్పాడు.

అందరూ మొత్తుకున్నారు.

అందరి నగల విలువ కలసి వెరశి పదహారు లక్షలదాకా వుంటుందని అంచనా వేశారు.

ఏకాంబరం పోలీసు రిపోర్టు ఇద్దామన్నాడు. ఒక్కరూ ఒప్పుకోలేదు, పరువు పోతుందని. ఆ నగలన్నీ నల్లడబ్బుతో

కొనివుండటంవల్ల, అనవసరమైన గొడవల్లో చిక్కుకో వలసి వస్తుందని భయపడ్డారు వాళ్లు.

ఏకాంబరం తిన్నగా పోలీస్ స్టేషనుకు వెళ్ళి జరిగింది మొత్తం వివరంగా చెప్పాడు.

ఇన్‌స్పెక్టర్ విని "ముందుగా మీరెందుకు చెప్పలేదు!" అడిగాడు.

"వాళ్ళను గురించి నా కనుమానం కలిగింది. అది నిర్ధారణ చేసుకుందామనుకున్నాను. ఈలోగా వాళ్ళు చెక్కేశారు. కానీ వాళ్ళ ఫొటోలు తీశాను. ఫిలిమ్ ఇంకా డెవలప్ చెయ్యలేదు. చేశాక మీకు ప్రింట్లు ఇస్తాను" అన్నాడు.

"మీరెక్కడ పనిచేస్తున్నారు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"పనికోసం తిరుగుతున్నాను. ఇంతలో వీళ్ళు తటస్థపడ్డారు. వీళ్ళు చేసిన బాంక్ దోపిడీ వివరాలు పేపర్లో చదివాను. వీళ్ళను పట్టుకొని మీ కప్పగిస్తే లక్షరూపాయల బహుమానం దొరుకుతుంది గదాని ఆశ పడ్డాను. అది కాస్తా నిరాశయింది" అన్నాడు ఏకాంబరం.

"మళ్ళీ ప్రయత్నించండి!"

"ఏవ్వూరు వెళ్ళారో? ఏమో? ఈమారు ఏ రూపంలో వుంటారో? ఏం నాటకం ఆడతారో? ఎలా తెలుసుకోవడం?" నిర్లిప్తంగా చెప్పాడు ఏకాంబరం.

ఆ తర్వాత పోలీసులు ఆ బంగళాకు వెళ్ళారు. అన్నీ వెతికారు. కొంతమంది విజిటర్సును ప్రశ్నించారు. కానీ వాళ్ళకు ఏమీ అంతు చిక్కలేదు.

ఈ పథకం జయప్రదంగా నిర్వహించేందుకు వాళ్ళు పెట్టిన ఖర్చు, వెలిగించిన దర్జా, వీటినిబట్టి, ఇది మెర్క్యూరీ

ముఠా చేసిన పనే అయివుంటుందని, పోలీసువర్గాలు భావించాయి.

ఏకాంబరం సప్లయిచేసిన ఫొటోల ఆధారంగా దేశం లోని పోలీసు బలగం యావత్తూ అప్రమత్తంగా వుండి, వాళ్ళు కనుపిస్తే అదుపులోకి తీసుకునే సన్నాహాలు చేశారు. పేపర్ల నిండా వాళ్ళ ఫొటోలు ప్రకటించారు. అంతకు ముందు బ్యాంక్ దోపిడీ సందర్భంగా, వాళ్ళ ఆచూకీకోసం ప్రకటించిన లక్షరూపాయల బహుమతి, లక్షాయాభైవేలకు పెంచింది ప్రభుత్వం.

ఇంతటి గుండెలు తీసిన మొనగాళ్ళను పట్టుకోవడంలో జాప్యం చేస్తున్నందుకు ప్రభుత్వాన్ని దుయ్యబట్టాయి పత్రికలు.

సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ వెంటనే రంగంలోకి దిగింది, దేశవ్యవహారాల మంత్రిగారి ఆదేశాన్ననుసరించి.

సీనియర్ ఆఫీసర్ లాల్ నియమింపబడ్డాడు. ఆయన అన్ని వివరాలు సేకరించుకుని కేసుల్ని క్షుణ్ణంగా 'పరిశీలించాడు. తను అవలంబించవలసిన పరిశోధనాపద్ధతి గురించి తీవ్రంగా ఆలోచించుకుని ఒక నిర్ణయానికి వచ్చాడు.

6

"ఏకాంబరం మీరేనా?" అడిగాడు లాల్ గదిలోకి ప్రవేశించిన వ్యక్తిని ప్రశ్నార్థకంగా చూసి.

"అవును!" అన్నాడు ఏకాంబరం.

"ప్లీజ్ సిట్ డౌన్!" కుర్చీ చూపించి, తనూ టేబుల్ కావలనున్న కుర్చీలో జేరబడ్డాడు లాల్. ముందుకు వంగి

ఏకాంబరం మొఖాన్నీ, కళ్ళనూ, తదేకంగా రెండు నిము షాలు గమనించి చూశాడు. ఆతర్వాత వెనక్కి వాలి సిగరెట్ తీసి వెలిగించుకొన్నాడు.

దమ్ము లాగి, పొగ వదుల్తూ "మిస్టర్ సుధాకర్! ఇక చెప్పండి! ఎంతదాకా వచ్చింది మీ పరిశోధన? ఎవరి తరఫున పరిశోధిస్తున్నారు?" అడిగాడు లాల్.

"ఎలా కనుక్కొన్నారు?" అడిగాడు ఏకాంబరంగా వ్యవహారిస్తున్న డిటెక్టివ్ సుధాకర్.

"మీ అంత గొప్పవాణ్ణి కాకున్నా కనీసం, మిమ్మల్ని మారువేషంలో వున్నంత మాత్రాన మోసపోయి, ఏకాం బరం అనుకొనేటంత అవివేకిని గాను!" అన్నాడు లాల్.

"నన్నెవ్వరూ గుర్తు పట్టలేదు. మిస్టర్ మెర్క్యురీ కోసం దాదాపు సంవత్సరంనుండి వల పన్నుతున్నాను. చిక్కినట్లే చిక్కి తప్పించుకొంటున్నాడు.

భిక్కవరం రాజాగార్ని లక్నోలో హోటల్లో కలుసుకున్నాడు ఈ మెర్క్యురీ. అక్కడే అతనూ మకాం పెట్టాడు. తనదగ్గిర వందరూపాయల నోట్లు అచ్చువేసే చిన్న పోర్టబుల్ మిషన్ వుందని చెప్పాడు. వారికి దాన్ని డెమాన్స్ట్రేషన్ చేసి చూపించాడు కూడా.

దాంట్లో అసలైన వందరూపాయల నోటు పైభాగాన పెట్టి, క్రిందివైపు, తెల్లకాగితం పెట్టి స్విచ్ నొక్కితే లైటు వెలుగుతుందట. రెండు క్షణాలుంచి ఆర్పితే, క్రింది కాగితం అసలైన, సిసలైన నూరురూపాయల నోటుగా మారుతుందట.

రాజాగారు నమ్మారు. రెండు లక్షలిచ్చి కొనుక్కొన్నాడు. ఆతర్వాత మరో మూడులక్షలు ఖర్చుపెట్టి కరెన్సీకి వాడే కాగితాన్ని సంపాదించాడు. కానీ ఆ మిషన్

పని చెయ్యలేదు. అంతా బూటకం అని తెలుసుకున్నాడు. నా దగ్గరకొచ్చి చెప్పాడు. అతన్ని ఎలాగైనా పట్టుకొని తనకు ఒప్పగించమని కోరాడు.

ఆ పనిలో పడి ఆరాలు తీశాను. ఆచూకీలకోసం ప్రయత్నించాను. కలకత్తాలో అతన్ని గుర్తించాను. నేను నిర్ధారణ చేసుకొని, అతన్ని బంధించాలనుకొనేలోగా, బ్యాంక్ దోపిడీచేసి మాయమయినాడు. అక్కడ్నించి నానాబాధపడి అనుమానం మీద మద్రాసు చేరాను. ఇక్కడా నా కళ్ళలో దుమ్ముకొట్టి వెళ్ళాడు'' అన్నాడు డిటెక్టివ్ సుధాకర్.

''అంటే వాళ్ళు సామాన్యులు కారనిపిస్తూంది!'' అన్నాడు లాల్.

''అవును, ఇన్నాళ్ళూ వాళ్ళను పరిశీలించటమే సరిపోయింది నాకు. సరియైన అవకాశం చిక్కలేదు. వాళ్ళ పథకం ఏమిటో నా కర్థం కాలేదు. ఇంత హఠాత్తుగా అంతర్ధానమై పోతారని నే నూహించలేక పోయాను'' అన్నాడు సుధాకర్ నొచ్చుకుంటూ.

''అందుకే అతనికి మిస్టర్ మెర్క్యూరి అని పేరు పెట్టాం. చిక్కినట్లే చిక్కి, మాయమై పోతుంటాడు'' అన్నాడు లాల్.

''ఈమారు అది సాధ్యం కాదనుకుంటాను. మనం ఇద్దరం వున్నాం'' అన్నాడు సుధాకర్.

''వాళ్ళు ఇంద్రజిత్తులు, మాయాజాలం తెలిసిన వాళ్ళలా, కళ్ళముందే ఆవిరిగా మారి అంతర్ధానమై పోతారు! మన భవిష్యత్ కార్యక్రమం ఏమిటి?'' అడిగాడు లాల్.

"ఇలాంటి నేరాలు చేశాక కొన్నాళ్ళపాటు వీళ్ళు మనకు కనుపించరు. ఎక్కడో అనామకులుగా వుండి పోతారు. ఆ తర్వాత మెల్లగా ఏదో పెద్ద పథకం వేసుకుని, పెద్ద సిటీలో ఆడంబరంగా మకాం పెడతారు. ఆ మకాం పెట్టిందాకా మనం కాచుకొని కూర్చోవలసిందే!" తన అభిప్రాయం చెప్పాడు సుధాకర్.

"వాళ్ళు ఎటు వెళ్ళివుంటారో మనం ప్రయత్నిస్తే తెలుస్తుం దనుకుంటాను. అజ్ఞాతవాసంలో వుండగానే మనం పసిగట్టగలిగితే చేతుల్లోంచి జారిపోకుండా పట్టుకో గల మనిపిస్తుంది!" అన్నాడు లాల్.

"ఆల్ రైట్! నేను రెడీ!" అన్నాడు సుధాకర్.

ఇద్దరూ ఆ తర్వాత ఒక గంటసేపు ఏం చెయ్యావలసిందీ ఎలా ముందుకు వెళ్ళవలసిందీ ఆలోచనలు చేసుకుంటూ గడిపారు.

బల్లపై నున్న ఫోన్ మ్రోగింది.

రిసీవరు పైకెత్తి "హల్లో! లాల్ హియర్!" అన్నాడు మెల్లగా.

"నేను ఐ. జి. పీ. ని మాట్లాడుతున్నాను" అవతలి వేపునుండి వినవచ్చింది బొంగురు గొంతు.

"చెప్పండి!"

"బిట్రగుంట కివతల, గ్రాండ్ ట్రంక్ రోడ్‌కు ప్రక్కగా ఒక అంబాసిడర్ కారు వదలివేసి వుందట. అందులో ఒక స్త్రీ శవంకూడా వుందట. ఆమె రూపు రేఖలు, మనం రాత్రే అన్ని స్టేషనులకూ టెలిఫోటో ద్వారా పంపిన మిస్టర్ మెర్క్యూరీ వెంటవున్న స్త్రీని పోలి వున్నాయట. మీరు చూస్తే బాగుంటుందేమో!" అన్నాడు ఐ. జి. పి.

"నా వెంట సుధాకర్ గారుకూడా వున్నారు. ఇద్దరం వెళ్ళొస్తాం" అన్నాడు లాల్.

"మీకు అవసరం అనిపిస్తే నేనూ వస్తాను!" అన్నాడు ఐ. జి. పి.

"వద్దు సార్! మేం చూసుకుంటాంగా?" అని ఫోన్ పెట్టేశాడు లాల్. విషయం వివరంగా చెప్పాడు.

రెండునిముషాల తర్వాత వాళ్ళిద్దరూ ఎక్కిన నల్ల అంబాసిడర్ మద్రాసు మహానగరపు రోడ్లను చీల్చుకుంటూ పరుగెత్తసాగింది.

మూడుగంటలా ముప్ఫయిఅరు నిముషాలకు వాళ్ళ కారు అల్లూరు రోడ్ బ్రిడ్జి కివతలవేపున్న చెట్లక్రింద ఆగింది.

లాల్ దిగాడు కారు. అతని వెనుక సుధాకర్ కూడా దిగాడు. ఇద్దరూ రోడ్ వారగానున్న అంబాసిడర్ కారు దగ్గరకు నడిచారు. పోలీస్ జీప్ కున్న హెడ్ లైట్లు ఆ కారువేపుకు పెట్టి ఆన్ చేయించారు.

రాణీగారిలా తిరిగిన స్త్రీయే హత్య కాబడిన మనిషని చూడగానే గుర్తుపట్టాడు సుధాకర్. ఆ విషయం లాల్ కు చెప్పి, కారంతా పరిశీలించి చూడసాగాడు. ఏ విధమైన ఆచూకీ దొరకలేదు.

డాష్ బోర్డుకు ప్రక్కనున్న రేడియో ఆన్ చేసివుంది. ఘుర్ మన్న శబ్దం తప్ప మరేవిధమైన సంగీతం వినరావడం లేదు. ఆ రేడియో సరిగ్గా చనిపోయిన ఆమె ముందుంది. బ్యాటిరీలైటు వేసి బ్యాండ్ ఇండికేటరునూ, స్టేషను ట్యూన్ చేసేందు కుపయోగపడే ముల్లును గమనించాడు. అది అహమ్మదాబాద్ స్టేషను అయివుండా లనిపించింది.

ఆ రాత్రివేళ ఆ స్టేషను ఎందుకు ట్యూన్ చేసివుంటారాని అనుమానం వచ్చింది. ఆ స్టేషనులో ఏ విధమైన ప్రోగ్రాములు వుండే అవకాశం లేదు.

వెలుపలున్న ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్ట్‌ను పిల్చి, ట్యూనింగ్ నాబ్ పై నున్న వేలిముద్రలు డెవలప్ చెయ్యమన్నాడు. అతను పని ప్రారంభించాడు. అరగంట తంటాలు పడ్డాక, సుధాకర్‌ను పిలిచి, ఆ ట్యూనింగ్ నాబ్ పై వున్నవి ఆమె వేలిముద్రలే నని చెప్పాడు.

"అంతమాత్రాన మనకేం తెలుస్తుంది?" అడిగాడు లాల్.

"మిస్టర్ మెర్క్యూరీ, అతని అనుచరుడూ, బహుశా అహమ్మదాబాద్ పోవాలనుకున్నారేమో. ఆమెను చంపే ప్రయత్నం చెయ్యగానే, వాళ్ళ ఆచూకీ అందించేందుకు ఆమె అలా ట్యూన్ చేసి వుండవచ్చుగా" అడిగాడు సుధాకర్.

"ఆమె వాళ్ళనుండి తప్పుకోవటంలో చేసిన ప్రయత్నంలో ఆ నాబ్ కదిలి అక్కడ ఆగిందేమో?" తన అనుమానాన్ని వ్యక్తపరచాడు లాల్.

"ప్రాణాలు తీస్తూంటే తీరికగా ఎవరన్నా రేడియో ట్యూన్ చెయ్యగలుగుతారా? అదీ ఏ ప్రోగ్రామూ రాని స్టేషనుకోసం తిప్పలు పడటం విచిత్రంగా లేదూ?" అడిగాడు సుధాకర్.

లాల్‌కికూడా అనుమానం కలిగింది. సుధాకర్ సునిశిత పరిశోధనాశక్తికి అచ్చెరువు పొందాడు. క్షణంపాటు అవాక్కయి చూస్తూ నిల్చున్నాడు.

"ఇక్కడ మనం చేసేది ఏమీలేదు! మిగిలిన తతంగ

మంతా పోలీసులు చూసుకుంటారు. మనం వెళ్దాం!" అన్నాడు సుధాకర్.

"అలాగే!" తలాడించాడు లాల్.

ఇద్దరూ కారెక్కారు.

కారు రయ్యిమని ముందుకు దూసుకువెళ్ళింది.

7

రోడ్ వెంట కనుపించిన ప్రతి పెట్రోలు బంకుదగ్గరా కారాపి, మెర్క్యురీ, అతని అనుచరుడూ, గుర్తులు చెప్పి అలాంటి రూపురేఖలున్న మనుషులు ప్రయాణంచేసే కారేదైనా వచ్చిందాని అడిగారు. ఎవ్వరూ చూచినట్లు చెప్ప లేదు. చిలకలూరిపేట దగ్గరున్న పెట్రోలుబంకువాలా అలాంటి మనుషులున్న ఒక పెద్ద కారు వచ్చిందనీ, పెట్రోలు పోసి డబ్బు తీసుకున్నానని చెప్పాడు.

"ఏం కారది?" అడిగాడు డిటెక్టివ్ సుధాకర్.

"పాత స్టుడీబేకర్ లాగుంది."

"రంగు."

"తెలుపనుకుంటాను."

"ఎంతమందున్నారు?"

"ముగ్గురున్నారు. ఫ్రంటు సీట్లో ఇద్దరూ, వెనుకసీట్లో ఒకతనూ కనుపించాడు."

"ఎన్ని లీటర్లు పోశావ్?"

"యాభై."

"నీ బిల్లులో కారు నెంబరు నోట్ చేశావా?" అడిగాడు లాల్ గద్దించి.

"చేశాను సార్. ఛెప్తానుండండి" అంటూ అతను లోనికి పరుగెత్తుకుపోయి బిల్ బుక్ తెచ్చి కాగితాలు త్రిప్పి "ఆ కారు నెంబరు జి. జె. కె. ఆరువేల మూడొం

దలా నల భై ఆరు సార్!'' అన్నాడు.

''థాంక్స్!'' అన్నాడు లాల్.

పదిరూపాయల కాగితం తీసి అతని చేతిలో పెట్టి లాల్ వెంట వెళ్ళి కారెక్కాడు సుధాకర్.

''ఏమనిపిస్తుంది?'' అడిగాడు లాల్.

''అంతా పకడ్బందీగా ప్లాను వేసుకొని చేశారు. అత నివరో సిద్ధంగా కారు తెచ్చిపెట్టాడంటే మనకు అంత కన్నా ఇంకేమనిపిస్తుంది?'' అడిగాడు సుధాకర్.

''మెర్క్యూరీకి పెద్ద బలగం వుండివుండాలి. అందువల్లే అతను పాదరసంలా జారిపోతున్నాడు'' అన్నాడు లాల్.

ఆ కారు నెంబరు చెప్తూ, దాన్ని ఎవరైనా చూసిందీ లేనిదీ అడిగి తెలుసుకుంటూ, హైదరాబాద్ చేరుకున్నారు ఇద్దరూ.

అక్కడిదాకా మెర్క్యూరీ కారు నెంబరును మార్చడం గానీ, లేదా వేరే కారు తెచ్చుకోవడం గానీ చెయ్యలేదు. నకిరేకల్ దగ్గిర పెట్రోలు పోయించుకున్నాడు. పెట్రోలు బంకు ప్రక్కనేవున్న టీ దుకాణంలోంచి కాఫీ తెప్పించు కున్నాడు. అన్నింటినీ మించి ఐదుపాకెట్ల రెడ్ విల్స్ సిగరెట్లు కొన్నాడు. ఆ బ్రాండ్ మెర్క్యూరీ చాలా దినాలనుండి వాడుతున్నట్లు సుధాకర్‌కు తెలుసు.

''ఆ కారులో వెళ్ళింది మెర్క్యూరీయే అనుమానం లేదు!'' అన్నాడు సుధాకర్.

''ఇందాకా ఫరవాలేదు. హైద్రాబాద్‌నుండి అతను ఎటు వెళ్తాడో, ఏ కారులో వెళ్తాడో మనకు తెలీదు. అలాంటప్పుడు ఏం చెయ్యడం'' అడిగాడు లాల్.

''మనం ఫాలో అయిన కారును అతను వాడని

పక్షంలో అదెక్కడో ఒకరి దగ్గర హైదరాబాద్‌లో వుండి తీరాలి. దాన్ని వెతుకుదాం. అది దొరక్కుంటే మెర్క్యూరీ అందులోనే ముందుకు పోతున్నట్లనుకొని వెంట పడదాం. అలా కాకుండా కారు ఇక్కడే దొరికితే, ఎవరి దగ్గర దొరికిందో వాళ్ళను కాస్త భయపెడితే అతని ఆచూకీ చెప్పొచ్చు,'' అన్నాడు సుధాకర్.

''వండర్‌ఫుల్! మీ ఆలోచన భేషుగ్గా వుంది!'' అన్నాడు లాల్ స్టీరింగు వదలి రెండు చేతుల్తో చప్పట్లు కొడుతూ.

''అలా వదలకు, ఆక్సిడెంటవుతుంది. ముందు మనం పోలీస్ కమిషనర్‌ను కలుసుకుని వచ్చిన పని వివరాలు చెప్పి, మనకు కావలసిన కారు జంటనగరాల్లో ఎక్కడుందో వెతికి చెప్పమని కోరుదాం'' అన్నాడు సుధాకర్.

''అదీ బాగుంది!'' అన్నాడు లాల్.

కారు తిన్నగా పోలీస్ కమీషనర్‌గారి ఆఫీస్‌కు పోనిచ్చారు.

లాల్‌నూ, సుధాకర్‌నూ చూడగానే కమీషనర్‌గారు వాళ్ళు వచ్చిన పని అర్థం చేసుకొన్నాడు. ఆయనకు మెర్క్యూరీ, అతని అసిస్టెంటుల ఫోటోలు అంతకు ముందే వచ్చి వున్నాయి.

''మీకేదైనా ఆచూకీ దొరికిందా?'' అడిగాడు సుధాకర్.

''లేదు!'' చెప్పాడు కమీషనర్.

''బహుశా ఆ యిద్దరూ, మేకప్‌లు మార్చుకొని, కార్లో ప్రయాణం చేస్తు వుండివుంటారు. అందువల్లే ఇంతదాకా ఎవ్వరూ అనుమానించలేక పోయారు'' అన్నాడు లాల్.

''అదీ పాయింట్. మీరిచ్చిన నెంబరు కారు ఇంకా

ఈ జంటనగరాల్లో వుంటే, ఇక పైన మనకండ్ల బడకుండా వెళ్ళేందుకు వీలు లేకుండా, అన్ని రోడ్లు బ్లాకు చేయించి వేస్తాను. సిటీ అంతా వెతికిస్తాను. నాలుగైదు గంటలు పడుతుంది. ఎక్కడుంటారు'' అడిగాడు కమీషనరు.

''మేమూ తిరుగుతాం ఊరంతా! అరగంటకోసారి మిమ్మల్ని కాంటాక్టు చేస్తాం'' చెప్పాడు సుధాకర్.

''ఓ. కే!'' అన్నాడు కమీషనర్.

8

లాల్, సుధాకర్ ఇద్దరూ వెలుపలికొచ్చి కారెక్కారు.

కారు కదిలింది.

''సుధాకర్ గారు'' పిలిచాడు లాల్ డ్రైవ్ చేస్తునే.

''ఊఁ!'' పలికాడు సుధాకర్.

''మనం రాకముందే వాళ్ళు హైద్రాబాద్ దాటిపోయి వుంటే అనవసరంగా టైం పాడుచేసుకొన్నట్లవుతుందేమోనని అనుమానంగా వుంది. మరో ఐదు గంటలు అక్కడే వుండి, అలాంటి కారెక్కడా దొరకలేదని చెప్తే మనం వాళ్ళకు ఇంకా ఎక్కువ దూరమయిపోయే ప్రమాదముంది'' అన్నాడు లాల్.

''అదే నేను ఆలోచిస్తున్నాను. మీరు అచూకీ తీస్తూ ఇక్కడే వుండండి. నేను కారు తీసుకొని వెళ్తాను. నేను బొంబాయి రోడ్ నే వెళ్తాడు. పెట్రోలు బంక్స్ లో చెప్పిపోతుంటాను. దాన్ని బట్టి మీరు నావెంట రావచ్చు ఈ కారు మీరు తీసుకెళ్ళండి!'' అన్నాడు సుధాకర్.

''ఓకే'' అన్నాడు లాల్, ఇంజన్ ఆపి దిగుతూ.

డిటెక్టివ్ సుధాకర్ స్టీరింగు ముందుకొచ్చి కూర్చున్నాడు.

కారు బొంబాయి రోడ్ ఎక్కింది.

ఆక్సిలేటరు నొక్కాడు.

అక్కడక్కడా కారాపి, మెర్క్యురీ ప్రయాణిస్తున్న కారు వివరాలు చెప్పి, ఆచూకీ తెలుసుకోనేందుకు ప్రయత్నించాడు. కానీ లాభం లేకపోయింది. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో షోలాపూరు దాటి ఇరవై మైళ్ళు ప్రయాణం చేశాడు. అక్కడ్నుంచి ఎడమవైపుకు దారి తీసే కచ్చారోడ్ కనిపించింది. ఆ సెంటర్లో కల్లు దుకాణంవుంది. అక్కడ కారాపి అడిగాడు.

కల్లు దుకాణంలోవున్న మనిషి, చిన్న కారొకటి వచ్చిందనీ, అందులో ఇద్దరున్నారనీ, ఇద్దరూ బాగా తాగి, కచ్చా రోడ్ వెంట వెళ్ళిపోయారనీ చెప్పాడు! అతను చెప్పిన పోలికల్ని బట్టి, మెర్క్యురీ, అతని అసిస్టెంటు అయివుండాలనిపించింది సుధాకర్ కు. కానీ కారు మాత్రం స్టుడీబేకరు అయివుండదనుకున్నాడు. హైదరాబాదులో కారు మార్చుకొని వుంటారేమోననుకున్నాడు సుధాకర్.

ఏమైనా ఆ కచ్చారోడ్ వెంట వెళ్ళి, కల్లు దుకాణం వ్యక్తి చెప్పిన మనుషుల్ని చూచిరావడం మంచిదని తీర్మానించుకున్నాడు.

కారు కచ్చా రోడ్ పైకి తిరిగింది. దాదాపు అరగంట తర్వాత, ఒక పాడుపడ్డ పెద్ద భవంతి కనుపించింది. అది రోడ్ కు దూరంగా వుంది. దాని వద్దకు కారు వెళ్ళే మార్గం లేదు.

తనకు ముందొచ్చిన వాళ్ళ కారు కోసం చూశాడు. ఎడమ వేపు, పెద్ద రాతి గుట్టవుంది. కారు దిగి ఆవైపు వెళ్ళాడు. ఆ గుట్ట వెనుక ఆస్టిన్ కారు కనుపించింది.

తలుపు లన్నీ మూసివున్నాయి. హాండల్ పట్టి క్రిందికి నొక్కాడు. డోర్ తెరచుకోలేదు.

వెనక్కి వెళ్ళి నంబర్ చూసి నోట్ చేసుకొన్నాడు. జేబులోంచి తాళాల రింగు తీశాడు. అందులోంచి మాస్టర్ కీ ఒకటి వెతికి, దాన్ని కారుడోర్ తెరవటానికి ప్రయత్నించాడు. అది లోనున్న లివర్లను సరిగ్గా పట్టుకోలేదు. వెలుపలకు లాగి, చిన్న ఫైల్‌తో రెండు మూడు సార్లు కొద్దిగా అరగ దీశాడు. మళ్ళీ ప్రయత్నించాడు. ఈమారు తక్కున తిరిగింది తాళం. డోర్ తెరచి లోనికి ఎక్కి కూర్చున్నాడు. కారంతా పరిశీలించాడు.

విప్పేసిన రెండు జతల బట్టలు కనిపించాయి. ఒక చిన్న జిప్ బ్యాగ్ వెనుక సీటుపైనుంది. దాన్ని తీసుకొని జిప్ లాగి చూశాడు సుధాకర్. రెండు రివాల్వర్లు కొంత అమ్యూనిషన్ వున్నాయి అందులో. దాన్ని యథాస్థానంలో పెట్టాడు.

ఆ కారు మెర్క్యురీ, అతని అసిస్టెంటు ఉపయోగించిందేనన్న నమ్మకం కలిగింది సుధాకర్‌కు. కారు దిగి తను వచ్చిన అంబాసిడర్ ఎక్కాడు. అది పోలీసుకారు కావడం వల్ల దాన్లో వైర్‌లెస్ సెట్ అమర్చివుంది. ఫోన్ తీసి, రేడియో ద్వారా కాంటాక్టు సాధించాడు ఆంధ్రా ఐ. జి. పి. తో. ఆయనకు విషయం వివరంగా చెప్పాడు. తానెక్కడున్నదీ చెప్పి, మహారాష్ట్ర ఐ. జి. పికి రింగ్ చేసి వెంటనే తగిన పోలీసు బలగాన్ని పంపే ఏర్పాట్లు చెయ్యమని కోరాడు. ఐ. జి. పి. గారు అందుకు అంగీకరించారు.

సుధాకర్ ఫోన్ పెట్టేసి ఆలోచించసాగాడు. ఆ ఇద్దర్నీ తనొక్కడే బంధించగలుగుతాడా అన్నది అను

మానంగా వుంది. పైగా వాళ్ళు పాడు పడ్డ ఆ పాత భవనంలో వున్నారు. ఏ మూలో దాక్కొనో తన పైన తుపాకీ కాల్చే ప్రమాదముంది. లాల్ వెంబడి వుంటే బాగుండేదనిపించింది. ఆ కారు కోసం తంటాలుపడుతూ అతను అక్కడే వుండిపోవటం, ఇప్పుడు తనకు సాయం లేకుండా చేసిందని బాధపడ్డాడు.

ఐ. జి. పి. గార్ని కారు విషయం, లాల్ విషయం అడిగివుంటే బాగుండే దనిపించింది. తన భవిష్యత్ కార్య క్రమం ఏమిటాని ఆలోచించసాగాడు. ఒంటరిగా వెళ్ళి ఆ ఇద్దరితో కలబడదామని రెండుమూడుసార్లు అనిపించినా, మెదడు అతని సాహసాన్ని అణచివేసింది.

కార్లో కూర్చుని, కప్ బోర్డులోంచి ఫీల్డ్ గ్లాసెస్ తీశాడు సుధాకర్. వాటి సాయంతో దూరంగా వున్న పాత భవంతిని తీక్షణంగా పరిశీలించి చూడసాగాడు. బంగళా పై అంతస్తులోని టెర్రెస్ బాగా కనుపించ సాగింది.

అక్కడెవ్వరూ మనుషులు లేరు. ఎవరయినా వస్తా రేమో చూద్దామని కూర్చున్నాడు. అలాగే గ్లాసెస్ పెట్టుకొని అలా దాదాపు ఇరవై నిముషాలు తదేకంగా చూస్తుండిపోయాడు సుధాకర్. అతని నిరీక్షణ ఫలించింది.

మెర్క్యూరీ వచ్చాడు వరండాలోకి, అతని వెంట అనుచరుడుకూడా వున్నాడు. ఇద్దరి చేతుల్లోనూ పెద్దపెద్ద స్టెన్ గన్ లున్నాయి.

వాళ్ళు తనున్నవైపే గమనించి చూడసాగారు. ఐనా అంతదూరంనుండి వాళ్ళకు తను కనుపించే అవకాశంలేదు.

సుధాకర్ కూడా లోడెడ్ గన్ తీసి చేత్తో పట్టు కొన్నాడు.

9

రెండు పోలీస్ జీప్‌లు వచ్చి ఆగాయి.

వాటి వెనుక మరో కారొచ్చింది. అందులోంచి లాల్ దిగాడు. తిన్నగా సుధాకర్ వద్ద కొచ్చాడు.

"గ్లాడ్! మొత్తానికి వాళ్ళ ఆచూకీ పట్టి సాధించావ్" అన్నాడు లాల్.

"ఇంతకూ వాళ్ళు ప్రయాణించిన కారు దొరికిందా?"

"లేదు! అనవసరంగా దానికోసం అక్కడుండి పోయాను నేను" అన్నాడు లాల్.

అంతదాకా జరిగింది టూకీగా చెప్పాడు సుధాకర్, లాల్‌కు. వాళ్ళకు కొద్దిదూరంగా నిలబడ్డారు పోలీసులు.

అందరూ పాత భవంతివేపు వెళ్ళారు.

పోలీసుల్ని తగిన జాగ్రత్తలో వుండమనీ, అవతలి ముఠావద్ద కావలసినంత ఆయుధసామగ్రి వుందనీ, చెప్పాడు సుధాకర్.

పోలీసుల్ని భవంతి చుట్టూ కాపలా పెట్టాడు. అంతకు ముందే ఆస్టిన్ కారు టైర్ల గాలి తీసేశాడు సుధాకర్, అందులోంచి తప్పించుకెళ్ళే అవకాశం లేకుండా.

లాల్, సుధాకర్, గన్‌తో కాలుస్తూ, భవంతిలోకి అడుగుబెట్టారు. లోపలంతా పాడుబడిపోయి వుంది. సాలె గూళ్ళు, పిచ్చికగూళ్లు, రణగొణ ధ్వనులు, మొత్తం దాన్ని చూడగానే దయ్యాల నివాసంలా మార్చివేశాయి.

ఇద్దరూ చెరో స్తంభం చాటు చేసుకుని, నుంచుని చుట్టుప్రక్కల గమనించి చూడసాగారు. ఏ విధమైన అలికిడిగానీ, ఎవరయినా తిరుగుతున్న జాడగానీ కను పించలేదు.

“వాళ్ళు క్రింద లేనట్లున్నారు. ఇందాకా నేను చూసి నప్పుడుకూడా పైనే వున్నారు” అన్నాడు సుధాకర్.

“అయితే పైకే వెళ్దాం!” చెప్పాడు లాల్.

“పదండి!” అంటూ ముందు దారితీశాడు సుధాకర్. మెట్లు ఎక్కడ్నుంచి వున్నాయో వెతుక్కునేందుకు పది నిముషాలు పైనే పట్టింది.

మెట్లెక్కి పైకి చేరుకున్నారు.

పైమెట్టు దగ్గరుండగా, మిరుమిట్లు గొలుపుతూ పేలిన తుపాకీ గుండు చెవిపక్కనుంచి రయ్యిమని దూసుకువెళ్ళడం గమనించాడు సుధాకర్.

“మిస్టర్ సుధాకర్!” ఎవరిదో పిలుపు వినవచ్చింది.

అటూ ఇటూ పరికించి చూశాడు.

మనుషులెవ్వరూ కనుపించలేదు.

“మమ్మల్ని పట్టుకోవాలని రావడం అవివేకం. మెర్క్యూరీ సామర్థ్యాలు మీకు తెలియనివి గావు. మీది వృధా ప్రయాస. మీ వెనుకనున్న సి. బి. ఐ. ఏజెంటు లాల్ గారికూడా నా సలహా ఇదే. దయచేసి వెళ్ళిపొండి. మీ ప్రాణాలు తియ్యనని హామీ ఇస్తున్నాను” అన్నాడు మెర్క్యూరీ ఏదో గోడ చాటు చేసుకుని.

“మిస్టర్ మెర్క్యూరీ! నీ ఆటలు సాగే కాలం పోయింది. ఇన్నాళ్ళూ నువ్వు మా కళ్ళు గప్పి తిరిగావ్. ఇక నీకు అది సాధ్యం గాదు. మర్యాదగా లొంగిపో. లేకుంటే నీ శవాన్నైనా తీసుకుని వెళ్ళగలను” అన్నాడు సుధాకర్.

మరు నిముషంలో సుధాకర్ కాళ్ళముందు లావుపాటి వస్తువేదో పడింది. నేలకు తగలంగానే పగిలి అందులోంచి

విపరీతంగా పొగ నల్లగా, దట్టంగా రాసాగింది. స్మోక్ బాంబ్ విసిరారని అర్థం చేసుకొన్నాడు సుధాకర్.

జేబురుమాలు తీసి ముక్కు దగ్గర పెట్టుకొన్నాడు. పొగలోంచి రివాల్వరు గురిపెట్టుకుని ముందుకు వెళ్ళాడు. లాల్ రాలేకపోయాడు. పొగ దాటి అవతలివేపు వెళ్ళి నిలుచున్నాడు.

కళ్ళలోకి పొగ పోవటంతో మంటలు పుట్టసాగాయి. నీళ్ళు క్రమ్మాయి. ఎదురుగా వున్నదేదీ కనుపించటం లేదు. జేబురుమాలుతో కళ్ళు తుడుచుకుని తల పైకెత్తి చూశాడు.

తన గుండెలకు తుపాకీ గురిపెట్టి నవ్వుతూ నిలుచున్న మెర్క్యురీ కనుపించాడు. అతన్ని అంటిపెట్టుకొని తిరిగే మూర్తి కనుపించలేదు.

సుధాకర్ క్షణం ఆలోచించాడు.

“చేతులు పైకెత్తు!” అరచాడు మెర్క్యురీ.

చెప్పినట్లు చేశాడు సుధాకర్.

“రివాల్వర్ పారెయ్!” ఆజ్ఞాపించాడు మెర్క్యురీ.

విసిరికొట్టాడు గురిచూసి మెర్క్యురీ మొహానికి తగిలేట్లు. అది తగలకుండా తప్పించుకునేందుకు ప్రక్కకు వంగాడు మెర్క్యురీ. వెంటనే ఎడంకాలిని రివ్వున గాలిలోకి విసరి నడుం విరిగేట్లు బలమైన దెబ్బ తగిలించాడు సుధాకర్.

ఆ తాకిడికి తట్టుకొని నిలబడలేక క్రింద పడ్డాడు మెర్క్యురీ. సుధాకర్ వెంటనే అతనిపైకి దూకాడు. ఉడుంలా పట్టుకొని, పైకి లేవనీకుండా తన శక్తి మొత్తం ఉపయోగించి అదిమిపెట్టాడు.

లాల్ కూడా అక్కడికొచ్చాడు. మెర్క్యూరీని ఇద్దరూ పట్టి లేపారు.

"అతనెక్కడ?" అడిగాడు సుధాకర్.

"ఎవరు?"

"నీ అసిస్టెంటు మూర్తి!"

"ఏమో? తెలీదు!"

"చెప్పు! లేకుంటే చంపేస్తాము నిన్ను."

"తెలీదు!" అన్నాడు మెర్క్యూరీ.

లాల్‌కు వొళ్లు మండింది. అరచెయ్యి పదునెక్కించి బలంగా విసిరాడు. చెంప ఛెళ్లుమంది. నోట్లోనుంచి రక్తం కూడా వచ్చింది.

"ఇతన్ని ఇక్కడ కొట్టి లాభంలేదు. పోలీసుపూరు తీసుకుపోదాం. అక్కడ చిత్రహింసలు పెడితే తప్ప మనకు అవసరమైన వివరాలు చెప్పడు" అన్నాడు సుధాకర్.

"అదీ నిజమే!" అన్నాడు లాల్.

"మీరు ఇతన్ని తీసుకువెళ్ళండి. నేనా మూర్తిని చూసివస్తాను!" అన్నాడు సుధాకర్.

లాల్ మెర్క్యూరీని జబ్బపట్టుకుని క్రిందికి లాక్కు వెళ్ళాడు. సుధాకర్ పైనున్న గదులన్నీ జాగ్రత్తగా తిరిగి వెతికాడు. ఎక్కడా మూర్తి కనుపించలేదు. ఏమయి వుంటాడని అక్కడే రెండు నిముషాలు నిలుచుని ఆలోచించాడు. తప్పించుకొని వెళ్ళి వుంటాడేమోనన్న అనుమానం కలిగింది. అందుకు అతనికి తగిన వీలు వుండడానికి అవకాశం లేదనిపించింది.

క్రింది గదుల్లో ఎక్కడైనా వున్నాడేమోనని మెట్లు

దిగి క్రిందికొచ్చి వెతికాడు.

లాల్ తిరిగొచ్చి "మూర్తి తప్పించుకొన్నాడు" అన్నాడు.

"ఎలా?" ఆత్రుతగా అడిగాడు సుధాకర్.

"మన జవాన్ను ఒక తన్ను బాగా తన్ని, స్పృహ పోయేట్లు చేసి, అతని యూనిఫాం ధరించి, మీ కారులో ఉడాయించాడు" అన్నాడు లాల్.

"వండ్రఫుల్! మరి పోలీసులంతా ఏం చేస్తున్నట్లు."

"చూశారట. మన మేదన్నా కార్లోంచి తెమ్మని అతన్ని పురమాయించి వుంటామని చూస్తూ వుండిపోయారట."

"మెర్క్యురీ ఎలా వున్నాడు."

"నోట్లోంచి ఊరకే రక్తం కారుతూంది. నిస్పృహాగా పడివున్నాడు. ముందతన్ని హాస్పిటల్‌కు తీసుకువెళ్ళడం నయం!" అన్నాడు లాల్.

"అలాగే చేద్దాం! మీ రతన్ని షోలాపూర్ తీసుకెళ్ళి, ఆ పనులు చూడండి. నేనా మూర్తినికూడా పట్టుకొస్తాను" అన్నాడు సుధాకర్.

"అలాగే! ఒంటరిగా వెళ్ళకండి. కావాలంటే కొంత మంది పోలీసుల్ని వెంటబెట్టుకొని పొండి!" అన్నాడు లాల్.

"అవసరం లేదు!" అంటూ అంతకుముందు తను కారాపిన ప్రదేశానికి వచ్చాడు. కారు లేదు.

లాల్ గారొచ్చిన కారు తను తీసుకున్నాడు. రెండు పోలీసు జీపుల్లోనూ మిగిలినవాళ్లు సర్దుకున్నారు. వాహానాలన్నీ మెయిన్‌రోడ్ వైపు బయలుదేరాయి.

పోలీస్ జీప్‌లు షోలాపూరుకు కదిలాయి.

10

డిటెక్టివ్ సుధాకర్ కారాపి మళ్ళీ కల్లు అంగడిలోకి నడిచాడు. అంతకుముందు తనతో మాట్లాడిన వ్యక్తి రక్తపు మడుగులో పడివున్నాడు. దగ్గరకెళ్ళి చూశాడు. అతని గుండె భాగంపైన నల్లగా కాలి వుంది. గుండ్రని రంధ్రంకూడా పడివుంది.

తన దగ్గరనుండి తప్పించుకొన్న మూర్తి, అతన్ని గురించి, మెర్క్యూరీ గురించి సమాచారం ఆ కల్లు దుకాణం మనిషే అందించి వుంటాడన్న కోపంతో ఇంత దారుణం చేసివుండా లనిపించింది. మూర్తిపైన ఎక్కడలేని కోపం వచ్చింది సుధాకర్‌కు.

అతను షోలాపూర్ వైపు వెళ్ళివుండ డనిపించింది. బొంబాయి రూటువెంట పోనిచ్చాడు కారు. కనుపించిన ప్రతి కారును ఆపి, తనకు కావలసిన సమాచారంకోసం అందులోనివాళ్ళను ప్రశ్నించి ప్రయత్నించాడు. ఎవ్వరూ ఏమీ చెప్పలేకపోయారు. కనీసం అలాంటి కారును చూచి నట్లుకూడా చెప్పకపోవటం సుధాకర్‌కు ఆశ్చర్యం కలి గించింది.

అంటే మూర్తి ఆ రూటులో పోయివుండడేమో ననిపించింది. కారు వెనక్కి త్రిప్పి షోలాపూర్ వేపు పోనిచ్చాడు.

మెర్క్యూరీని పట్టుకోగలిగినందుకు ఆనందం కలిగినా, మూర్తిని పట్టుకోలేక పోయినందుకు విచారం వేసింది. తాను ఇంకా కొంత జాగ్రత్త పడి వుండాల్సిం దను కొన్నాడు సుధాకర్.

ఆలోచనలు తెగకముందే కారు షోలాపూర్ వూరి మధ్యకు వచ్చేసింది.

జనరల్ హాస్పిటల్‌లో మెర్క్యూరీకి ట్రీట్‌మెంట్ ఇస్తున్నారని తెలుసుకొని కార్ను అక్కడికే పోనిచ్చాడు డిటెక్టివ్ సుధాకర్.

రెండో అంతస్తులో వున్న స్పెషల్ రూమ్స్‌లో నాలుగో నెంబరుదాంట్లో పెట్టారు మెర్క్యూరీని. వెలుపల పోలీసులు కాపలా కాస్తున్నారు.

లాల్‌గారు కారిడార్‌లో పిట్టగోడ ప్రక్కగా ప్రేము కుర్చీ వేసుకొని సిగరెట్ త్రాగుతూ కూర్చున్నాడు.

సుధాకర్ రాగానే "చిక్కాడా?" అడిగాడు లేచి నిల్చొని.

"లేదు! అతను కూడా ఇటే వచ్చివుండా లనిపిస్తుంది. కనుపించిన ప్రతి కారునూ ఆపి వాకబు చేశాను. నల్లరంగు కారును ఎవ్వరూ చూడలేదంటున్నారు" అన్నాడు సుధాకర్.

"దెబ్బ ఎక్కడ తగిలిందో ఏమో, ఇతనికి టెంపరేచర్ బాగా వచ్చింది. రక్తం నోటినుండి కారుతూనే వుందట. మన స్మారకంలో లేడతను. పోలీసులు అజాగ్రత్తగా వుంటారేమోనని నేనూ కాపలా కాస్తున్నాను" అన్నాడు లాల్.

అంతలో ఒక డాక్టరు స్టెతస్కోపు ఊపుకుంటూ వచ్చి, తిన్నగా మెర్క్యూరీ గదిలోకి వెళ్ళిపోయాడు.

"ఇతనేనా మెర్క్యూరీని ట్రీట్ చేస్తున్నది" అడిగాడు సుధాకర్.

"ఒకరని లేనట్లుంది. ఎవరు డ్యూటీలో వుంటే వాళ్లు వచ్చేట్లుంది. ఇంతకుముందొకతను వచ్చాడు. ఇతను రెండోవాడు" అన్నాడు లాల్.

"మూర్తి ఇంకా బైటే వున్నాడు. అతన్ని పట్టుకో

లేకపోవడం, మనకు మెర్క్యూరీని కాపాడుకోనడం పెద్ద సమస్యగా మారుతుంది. క్రొత్తవాళ్ళను ఇటు రానివ్వకూడదు. వీలైనంతవరకూ, ఒకే డాక్టరు, ఒకే నర్సు, అతన్ని ట్రీట్ చెయ్యడం మంచిది. ఈ విషయంలో తగిన ఏర్పాట్లు చెయ్యమని డి. యం. ఓ. తో నేను మాట్లాడుతాను" అన్నాడు సుధాకర్.

లాల్ జవాబు చెప్పకుండా మౌనంగా వుండిపోయాడు. సుధాకర్ క్రిందికి వెళ్ళాడు డి. యం. ఓ. ను కలుసుకునేందుకు.

లోపలకు వెళ్ళిన డాక్టరు వెలుపలికొచ్చి ఒక్క క్షణం కారిడార్‌లోకి చూసి, బూట్లు చప్పుడు చేసుకుంటూ చకచక వెళ్ళిపోయాడు.

ద్వారబంధానికి రెండు ప్రక్కలా నిలుచునివున్న పోలీసులు అప్పుడే కునికిపాట్లు పడటం గమనించాడు లాల్. కుర్చీలో లేచి సర్దుకుని కూర్చున్నాడు.

మెర్క్యూరీ చేసిన నేరాలు, దొంగతనాలు, హత్యలు, దోపిడీలు, మొదలైనవాటి వివరాలతో నిండిన ఫైల్సు కళ్ళముందు తిరిగాయి. అతన్ని డిటెక్టివ్ సుధాకర్ సాయంతో పట్టుకోగలిగినందుకు ఎంతో ఆనందంగా వుంది.

కానీ అతనికి అన్ని విషయాల్లోనూ కుడిభుజంగా వుండిన అసిస్టెంటు మూర్తిని పట్టుకోలేక పోయినందుకు అసంతృప్తిగా వుంది.

సుధాకర్ క్రిందనుండి పైకొచ్చాడు. లాల్ గారి కెదురుగావున్న కుర్చీలో కూర్చున్నాడు.

"డి. యం. ఓ. తో మాట్లాడారా?" అడిగాడు లాల్.

"ఆఁ ఏర్పాట్లు చేస్తానన్నాడు."

"మూర్తి విషయం ఏం చేద్దాం?" అడిగాడు లాల్.

"అతను, మెర్క్యురీని ఇక్కడనుంచి ఎలాగైనా తప్పించి తీసుకెళ్ళేందుకు పెద్ద పథకం వేస్తాడు. మనం ఒళ్ళంతా కళ్ళుచేసుకుని కాపలా కాయాలి. లేకుంటే పడ్డ శ్రమ అంతా వృథా అవుతుంది. అతన్ని మనం వెతికి పట్టుకోలేం. కానీ వెతుక్కుంటూ ఇక్కడికొచ్చినప్పుడు అప్రమత్తంగా వుండి, పట్టుకోవాలి! అంతకన్నా నాకు మరో మార్గం తోచడం లేదు!" అన్నాడు సుధాకర్.

"కరెక్ట్! మీ ఆలోచనే బాగుంది!" అన్నాడు లాల్.

క్రింద ఏదో కోలాహలం వినిపించింది. నర్సులు, డాక్టర్లు అంతా స్టాఫ్ రూంకేసి పరుగెత్తడం గమనించారు. సుధాకర్ దిగి క్రిందికి వెళ్ళాడు.

స్టాఫ్ రూం వెలుపల జనం గుమిగూడి వున్నారు.

"ఏమయింది?" అడిగాడు అక్కడున్న మనుషుల్లో ఒకర్ని.

"ఎవరో డాక్టరు ఆత్మహత్య చేసుకున్నాడట!" చెప్పాడతను.

"ఎందుకని?"

"తెలీదు!"

సుధాకర్ జనాన్ని త్రోసుకొని లోనికి వెళ్ళాడు. డాక్టర్లు చాలామంది నిలుచుని వున్నారు. వాళ్ళ మధ్య డి. యం. ఓ. గారుకూడా వున్నారు. ఆయన దగ్గరగా వెళ్ళి నిలుచుని అడిగాడు విషయమేమిటని.

"ఇతనెవరో అర్థం కాలేదు. ఇక్కడికొచ్చి ఆత్మహత్య చేసుకొన్నాడు" అన్నాడు కుర్చీలో మెడ వ్రేలాడేసి కూర్చున్న డాక్టరును చూపించి.

"డాక్టరులాగున్నాడు. ఇక్కడి వాడు కాడా?"

"లేదు!" అన్నాడు డి. యం. ఓ.

"ఇందాక పైనున్న ఖైదీని పరీక్ష చేసిపోయిందితనే!" అంటూ, దగ్గరకంటూ వెళ్ళి చూశాడు సుధాకర్. క్రాపు కృత్రిమంగా వుంది. జుట్టు పట్టుకుని లాగాడు. విగ్ ఊడి వచ్చింది చేతిలోకి. కళ్ళకున్న జోడు తీశాడు. మీసాలు లాగేశాడు. కుడిబుగ్గపై నున్న నల్లని పులిపిరిని చేత్తో అది మాడు. అది కాస్తా రాలి క్రింద పడింది.

ఆ ఆకారం చూసి విస్తుపోయాడు సుధాకర్.

"స్కౌండ్రల్!" అంటూ జనాన్ని తోసుకుని మేడ మీదకు పరుగెత్తాడు.

సిగరెట్ కాలుస్తున్న లాల్ తక్కున లేచి "ఏమైంది?" అడిగాడు.

"సర్వనాశనమయింది" అంటూ గదిలోకి పరుగెత్తాడు. తలమీద దుప్పటి కప్పుకుని పడుకునివున్నాడు మెర్క్యూరీ. దుప్పటి క్రిందనున్న చెయ్యి లాగి పల్స్ చూశాడు. అంద లేదు. చల్లగా వుంది శరీరం.

మెర్క్యూరీ ప్రాణాలు పోయి అప్పటికే ఎంతోసేపు అయివుండదని తెలుసుకొనేందుకు పెద్ద విజ్ఞానం అవ సరం లేదనిపించింది సుధాకర్‌కు.

ప్రక్కనే నిల్చున్న లాల్‌తో "ఆ మూర్తిగాడు అనుకున్నంతా చేశాడు. డాక్టరు వేషంలో వచ్చి మెర్క్యూరీని చంపేశాడు. ఎటూ చట్టానికి పట్టుబడక తప్పదని తనూ విషం తీసుకొని చనిపోయాడు" అన్నాడు.

లాల్ రెండు చేతులూ గట్టిగా నలుపుకున్నాడు. డి. యం. ఓ. నిశ్చేష్ఠుడై నిలుచున్నాడు.

—: ఐపోయింది :—